క్లుప్తంగా

వైద్యశిబిరం



విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువుపై దృష్టి కేంద్రీకరిస్తారని సత్యసాయి గురుకులం కరస్పాండెంట్ ఏ.శ్యాంసుందర్ అన్నారు. ఆల్కాట్ గార్డెన్స్‌లోని సత్యసాయి గురుకులంలో రెండు రోజులు జరిగే వైద్యశిబిరాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చెవి, ముక్కు, గొంతు, దంత పరీక్షలు నిర్వహించి అవగాహన కల్పించారు. వైద్యులు సత్తి రవికాంత్, ప్రియ, బత్తి బాబు, దివ్యభాను సేవలందించారు. కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపాల్ కె.గుర్రయ్య, బ్లాక్ ఇన్‌చార్జి పి.గౌరి పాల్గొన్నారు.

తిరుపతికి భక్తుల పయనం



తిరుపతికి పయనమవుతున్న కాలనీ వాసులు

సీటీఆర్ఐ: ఎస్సీ కాలనీ వాసులను శ్రీవారి దర్శనానికి ఉచితంగా తీసుకువెళ్లడం ఆనందంగా ఉందని తిరుమల తిరుపతి దేవస్థానం ప్రోగ్రామ్ సహాయకుడు ఓరుగంటి నరసింహయోగి అన్నారు. గురువారం స్థానిక తాడితోట శారద నగర్ ఎస్సీ కాలనీలోని 47 కుటుంబాలను శ్రీవాణి ట్రస్టు, తిరుమల తిరుపతి దేవస్థానం ఆర్థిక సాయంతో సమరసత సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తిరుపతికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో బండ్ల రామశంకర్, అందే మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

టేకు ముక్కలు స్వాధీనం



నిందితులతో రేంజ్ అధికారి సత్యనారాయణ తదితరులు

సీటీఆర్ఐ: టేకు అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఫారెస్టు రేంజ్ అధికారి టి.సత్యనారాయణ అన్నారు. బుధవారం రాత్రి టేకు ముక్కలు, చెక్కుడు దిమ్మలను గోపవరం నుంచి అక్రమంగా రవాణా చేస్తున్న వ్యాన్ పట్టుకున్నారు. గురువారం వ్యాన్‌తో సహా నిందితులను రాజమహేంద్రవరం రేంజ్ కార్యాలయానికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ16టీఎఫ్ 4760 వ్యాన్‌లో టేకు ముక్కలు రవాణా చేస్తుండగా పట్టుకున్నామన్నారు. వీటి విలువ సుమారు రూ.1.10 లక్షలు ఉంటుందన్నారు. డిప్యూటీ రేంజ్ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు, వై.శ్రీను, ఎం.కార్తిక్ పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం

ప్రకాశం నగర్: కార్తిక్ అనే ఎనిమిది నెలల చిన్నారి వైద్య ఖర్చుల కోసం గోకవరం, ఏజెన్సీ మండలాల పీఎంపీ సభ్యులు, శ్రీలలితా మెమోరియల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఫౌండేషన్ అధ్యక్షుడు పి.చిన్ని చేతుల మీదుగా రూ.ఐదువేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా పీఎంపీ జిల్లా కార్యదర్శి బళ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ సీతంపేటకు చెందిన దేవరకొండ జీవిత కుమారుడు కార్తిక్ కాలేయ వ్యాధితో బాధపడుతున్న నేపథ్యంలో సినీనటుడు సోనూసూద్ సహకారంతో కొచ్చీలో కాలేయ మార్పిడి శస్త్రచికిత్స చేయ్యడం జరిగిందన్నారు. ప్రతినెలా మందులకు దాతలు సహకారం అందించాలని చిన్నారి తల్లి కోరడంతో సాయం అందజేశామన్నారు. ఇంకా ఎవరైనా దాతలు 63056 21044 నంబర్‌కు ఫోన్‌పే చేయవచ్చన్నారు.

విభజన హామీలను నెరవేర్చాలి

ప్రకాశం నగర్: కేంద్రం విభజన చట్టంలోని హామీలను నెరవేర్చాలని, హామీల సాధన కోసం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జరిగే బస్సు యాత్రకు సంపూర్ణ మద్దతు తెలియ చేస్తున్నామని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పేర్కొన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన వనజ మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం జనవరి 23, 24న ప్రజా సంఘాలతో కలిపి రెవెన్యూ డివిజన్ల వద్ద ఆందోళన నిర్వహిస్తామన్నారు. జిల్లా కార్యదర్శి తాటిపాక మధు పాల్గొన్నారు.

సమ్మేటివ్ పరీక్షల పరిశీలన

ప్రకాశం నగర్: సమ్మేటివ్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని రాజమహేంద్రవరం అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ అన్నారు. గురువారం ఉదయం గాంధీపురం – 2 ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న పరీక్షలను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు ప్రశ్నపత్రాలను దిద్ది, మార్కులను రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. విద్యార్థుల వర్క్ పుస్తకాలను పరిశీలించారు.

ఆరోగ్యశ్రీతో కొత్త జీవితం

- ఆస్పత్రిలో వైద్య చికిత్స పొందిన మాచిరాజు
- సీఎం జగన్‌పై అభిమానంతో విష్ణు సహస్రనామ గ్రంథాల పంపిణీ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఎంతోమందికి వైద్య సేవలు అందిస్తున్నారు. వారు సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆరోగ్యశ్రీ పథకంతో వైద్యం చేయించుకున్న మాచిరాజు.. సీఎం జగన్‌పై అభిమానంతో విష్ణు సహస్రనామ గ్రంథాలను పంపిణీ చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. రాజమహేంద్రవరం ఆవరోడ్ ఎండోమెంట్ వాంబే కాలనీకి చెందిన పసలపూడి మాచిరాజు టైలరింగ్ వృత్తితో జీవిస్తున్నారు. అలాగే విష్ణుసహస్రనామ స్తోత్ర ప్రవచకులుగా ఉన్నారు. గతేడాదిలో జూన్‌లో పసలపూడి మాచిరాజు గుండె సమస్య వచ్చింది. ఆయనకు ఆరోగ్యశ్రీ పథకంలో నగరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం చేశారు. అనంతరం సుమారు మూడునెలలకు ఒకసారి రూ.10 వేలు విలువైన మందులను ఏడాది పాటు అందించడంతో పాటు ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు ఇచ్చారు. ఇలా వేల మందిని ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కాపాడుతున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకోవాలన్న ఏకైక సంకల్పంతో, ఆయన సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశంతో వంద విష్ణుసహస్రనామ గ్రంథాలను ప్రత్యేకంగా ప్రచురించారు. వీటిని ఆరోగ్యశ్రీ లబ్ధిదారులు పేరుతో వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్‌విప్, ఎంపీ మార్గాని భరత్‌రామ్, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి చేతుల మీదుగా ఆవిష్కరించి పార్టీ శ్రేణులకు పంపిణీ చేశారు.



విష్ణుసహస్రనామ గ్రంథాలను ఆవిష్కరిస్తున్న ఎంపీ భరత్‌రామ్ (ఫైల్)

సీఎం జగన్‌పై అభిమానంతో..

ఆరోగ్యశ్రీ పథకం ద్వారా సీఎం జగన్‌మోహన్ రెడ్డి నాకు ప్రాణదానం చేశారు. దానికి కృతజ్ఞతగా ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని వంద విష్ణు సహస్రనామ గ్రంథాలు ప్రచురించాను. ఎంపీ మార్గాని భరత్‌రామ్ చేతుల మీదుగా పార్టీ శ్రేణులకు పంపిణీ చేశాను.
– పసలపూడి మాచిరాజు, రాజమహేంద్రవరం

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

- రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- దుళ్లలో గడపగడపకూ మన ప్రభుత్వం

కడియం: ప్రజా సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. దుళ్ల సచివాలయం – 1 పరిధిలో గురువారం తొలిరోజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా చందన నాగేశ్వర్ వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. సీఎం జగన్ ప్రభుత్వం ఆయా కుటుంబాలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటని వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

అర్హుల ఇంటికే పథకాలు

చందన నాగేశ్వర్ మాట్లాడుతూ అర్హత గల ప్రతి లబ్ధిదారుడికీ సంక్షేమ పథకాలు అందించడంతో పాటు, గ్రామాల సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సచివాలయం, వలంటరీ వ్యవస్థ ద్వారా ప్రతి పథకం నేరుగా లబ్ధిదారుడికే అందేలా సీఎం జగన్ ఏర్పాటు చేశారన్నారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ప్రజల జీవితాలను మెరుగుపరుస్తున్న జగన్‌కు మద్దతుగా ప్రజలు నిలవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు, మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, మండల బూత్ కమిటీ కన్వీనర్ తాడాల విష్ణుచక్రవర్తి, దుళ్ల సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు, ఎంపీటీసీ కట్టుంగ నాగరాజు, మాజీ ఎంపీటీసీలు తోకల వీర వెంకట్రావు, నాగిరెడ్డి వీరశివాజీ, మాజీ ఉపసర్పంచ్ తాతపూడి బాబీ, కడియపులంక సొసైటీ చైర్మన్ తిరుమలశెట్టి శ్రీను, పార్టీ నాయకులు సన్నపు బ్రహ్మానందం, జిలగం గంగాధరం, ఇందుపురాల శ్రీను, నామాల బాలసరోజని, చాపల శేఖర్, నూలు సోమేశ్వరరావు పాల్గొన్నారు.



దుళ్లలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్

త్వరలో జిల్లాలో ఆకస్మిక తనిఖీలు

రాజమహేంద్రవరం సిటీ: వినియోగదారుల హక్కులకు భంగం కలిగితే సహించేది లేదని, త్వరలో జిల్లా మొత్తం ఆకస్మిక తనిఖీలు చేపడతామని జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యులు గొట్టిముక్కల అనంతరావు తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ వ్యాపారస్తులు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ఎమ్మార్పీ కంటే అధిక బిల్లు వసూలు, జీఎస్టీ, తూకాలలో మోసాలు ఉంటే సంబంధిత అధికారులకు తెలియజేయాలని కోరారు. కేబుల్ ఆపరేటర్లు, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్, ప్రైవేట్ పాఠశాలలు, కాలేజీలు, హాస్పిటళ్లు, ప్రైవేట్ లాబ్‌లలో అధిక వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిపై సంబంధిత అధికారులతో చర్చించి చర్యలు చేపడతామన్నారు. వినియోగదారులు మోసపోతే నష్టపరిహారం కోసం జిల్లా కమిషన్‌లో కేసు వేయాలన్నారు. కేసుల విషయంలో సహకారం అందిస్తామన్నారు. పరిష్కారం కాని సమస్యలపై కలెక్టర్ అధ్యక్షతన జరిగే డీసీపీపీ సమావేశంలో ప్రస్తావించి చర్యలు చేపడతామన్నారు. వినియోగదారులు టోల్ ఫ్రీ 18004250082, సైబర్ క్రైం సంబంధించి 1930కు ఫిర్యాదు చేయాలన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి

రాజమహేంద్రవరం రూరల్: నిత్యం ప్రజల్లో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. స్థానిక చందన గార్డెన్స్‌లోని రూరల్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం ఉదయం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వర్ మాట్లాడుతూ ఈ నెల 3న ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరిగిన సీఎం బహిరంగ సభ, వైఎస్సార్ పెన్షన్ కానుక మహోత్సవాల సభకు రూరల్ నియోజక వర్గం నుంచి 380 బస్సుల్లో 17 వేలమంది అభిమానులు తరలి వెళ్లారన్నారు. సభను జయప్రదం చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. శాటిలైట్ సిటీకి చెందిన పార్వతి లాలాచెరువు దగ్గర అనుకోకుండా ప్రమాదానికి గురైతే, దాన్ని సీఎం సభకు ముడిపెట్టడం సబబు కాదన్నారు. టీడీపీ, జనసేన దుష్ప్రచారం మానుకోవాలని హితవు పలికారు. రూరల్ నియోజకవర్గంలోని పంచాయతీల్లో పారిశుద్ధ్యం, ప్రజారోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. పందులను తరలించడానికి ప్రయత్నాలు చేస్తుంటే, కోర్టుకి వెళ్లి స్టే తీసుకురావడంతో ఆగిపోయిందని, అయినప్పటికీ సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు వివరించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చందన నాగేశ్వర్

మాదక ద్రవ్యాలతో అనేక అనర్థాలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాష్ట్ర ప్రభుత్వం ఆశయం డ్రగ్‌ఫ్రీ ఆంధ్రప్రదేశ్ సాకారానికి విద్యార్థులు కృషి చేయాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో నార్త్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ అన్నారు. రాజీవ్‌గాంధీ డిగ్రీకళాశాలలో గురువారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల సేవనం ద్వారా వచ్చే ఆరోగ్య, మానసిక, సామాజిక సమస్యలను వివరించారు. మత్తు పదార్థాల అమ్మకం, కొనుగోలు వంటి వాటిపై టోల్‌ఫ్రీ నంబర్ 14500కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈబీ ఎస్సై మహేష్, కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.మేరీజోన్స్ రోసెట్, వైస్ ప్రిన్సిపాల్ మేజర్ కె.శైలజ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఈబీ నార్త్ ఇన్‌స్పెక్టర్ రమణ

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: అత్యవసర మరమ్మతులు నేపథ్యంలో శుక్రవారం నగరంలో విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. సుబ్బారావు నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పీఅండ్‌టీ కాలనీ, 5వ నంబర్ బస్టాండ్ కోరుకొండ రోడ్, రాజా థియేటర్, క్వారీ సెంటర్, టీవీ రోడ్, కొంతమూరు, భవానీపురం, రామదాస్ పేట, పనసచెట్టు సెంటర్, సంజీవనగర్ ఏరియాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకూ సరఫరా ఉండదన్నారు.

జైన్ సంఘం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

సీటీఆర్ఐ: జైనులకు పుణ్యక్షేత్రమైన జార్ఖండ్‌లోని సమ్మెత్ శిఖర్ పర్వత శ్రేణులను పరిరక్షించాలని జైన్ సేవా సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం డీలక్స్ సెంటర్ నుంచి కోటగుమ్మం మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించింది. ఈ సందర్భంగా అశోక్ కుమార్ జైన్, విక్రమ్ జైన్ మాట్లాడుతూ జార్ఖండ్‌లోని సమ్మెత్ శిఖర్ ఆలయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిరక్షించాలన్నారు. జార్ఖండ్ రాష్ట్రం 2019లో పర్యాటక ప్రాంతంగా ప్రకటిస్తూ విడుదల చేసిన జీవోలు వెనక్కి తీసుకోవాలని కోరారు. ఆ పర్వత శ్రేణులలో 20 జైన తీర్థంకరులు తపస్సు ఆచరించి మోక్షం పొందారన్నారు. దైవ దర్శనానికి ఆ పర్వతాలపై ఎక్కేటప్పుడు జైనులు కాళ్లకు చెప్పులు కూడా వేసుకోరన్నారు. ఇప్పుడు ఆ ప్రాంతాన్ని పర్యాటక ప్రదేశంగా ప్రకటించడంతో మాంసం, మద్యం దుకాణాలు, జూదం, ఇతరత్రా అసాంఘిక కార్యకలాపాలు జరిగే అవకాశం ఉందన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఏఓకు, కలెక్టర్ మాధవీలతకు వినతి పత్రం అందజేశారు.

వేదపాఠశాల వార్షికోత్సవాలు



మాట్లాడుతున్న ఆచార్య విశ్వనాథశాస్త్రి

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరులోని దత్తాత్రేయ వేదవిద్యా గురుకులం 22వ వార్షికోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అద్వైత సిద్ధాంత ప్రాశస్త్యం గురించి జరిగిన సభలో ఆచార్య మద్దులపల్లి దత్తాత్రేయ శాస్త్రి, చెన్నైకి చెందిన ద్రవిడ శాస్త్రి, తిరుపతి సంస్కృత విశ్వవిద్యాలయానికి చెందిన ఆచార్య కుప్పా విశ్వనాథ శాస్త్రి తదితరులు ప్రసంగించారు. వేద పాఠశాల వ్యవస్థాపకుడు, స్వాధ్యాయరత్న గుళ్లపల్లి సీతారామచంద్ర ఘనపాఠి సభను నిర్వహించారు. శుక్రవారం ఉదయం దత్తాత్రేయస్వామికి విశేష అర్చన, సువాసినీ స్త్రీలచే గౌరీపరమేశ్వరికి లక్ష కుంకుమార్చన నిర్వహిస్తారు. శనివారం విష్ణు, ఆదిత్య, గణపతి, అంబికా సమేత సాంబసదాశివ పంచాయతనానికి ఏకాదశ రుద్రాభిషేకం జరుగుతాయి. ఆదివారం జరిగే ముగింపు సభలో ఉదయం 10 గంటలకు తిరుపతి రాష్ట్రీయ సంస్కృత విద్యాలయం ఉపకులపతి కృష్ణమూర్తి ప్రసంగిస్తారు.

సాక్షి సినిమా



శ్యామల :	అవతార్–2
సూర్యమినీ :	అవతార్–2
సూర్యప్యాలెస్ :	కనెక్ట్
స్వామి :	ధమాకా
శివజ్యోతి :	కింగ్‌డమ్ ఆఫ్ డైనోసార్స్
అనుశ్రీ :	ధమాకా
రాజా :	దమాకా
అశోక :	ఎ జర్నీ టుకాశీ
కుమారి :	టాప్‌గేర్
ఊర్వశి :	లాఠీ
రంభ :	ఖుషీ
మేనక :	ప్రత్యర్థి
గీతాఅప్సర :	18 పేజెస్
నామవరం	
వీఎస్ మహల్ :	ధమాకా
ధవళేశ్వరం	
మురళీకృష్ణ :	ఖుషీ

విద్యాభివృద్ధికి సీఎం జగన్ ప్రాధాన్యం

- ఎంపీ భరత్ రామ్
- ఉత్సాహంగా గుడ్ మార్నింగ్ రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం సిటీ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి సీఎం జగన్ అనేక చర్యలు తీసుకుంటున్నారని ఎంపీ భరత్ రామ్ అన్నారు. ఆయన అందజేస్తున్న పథకాలు, వసతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన ఆధ్వర్యంలో గురువారం స్థానిక 5వ డివిజన్ కంబాల చెరువు వద్ద గుడ్ మార్నింగ్ రాజమహేంద్రవరం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ స్కూలుకు సివిల్ డ్రెస్‌లో వెళుతున్న విద్యార్థులను చూసి షూస్, యూనిఫాం వేసుకోకపోవడంపై ఆరా తీశారు. అవి ఇవ్వలేదని విద్యార్థులు సమాధానం చెప్పడంతో వెంటనే డీఈఓ అబ్రహాంకు ఫోన్ చేసి.. విద్యార్థులకు ఇంకా షూస్, యూనిఫాం పంపిణీ చేయకపోవడంపై ప్రశ్నించారు. ఈ పరిస్థితి మరోసారి రిపీట్ కాకూడదన్నారు. దీనిపై అన్ని పాఠశాలల హెచ్ఎంలకు ఆదేశాలు జారీ చేయాలన్నారు. అలాగే కంబాల చెరువు సమీపంలోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయ నిర్మాణ పనులను పరిశీలించారు. వాటిపై అధికారులకు ఫోన్ చేసి అడిగారు. ఇంకా ఫ్లోరింగ్, సీలింగ్, ఎలక్ట్రికల్ పనులు పెండింగ్‌లో ఉన్నాయని అలాగే పైన మీటింగ్ హాల్ ఒకటి నిర్మించాల్సి ఉందని చెప్పడంతో మిగిలిన పనులు పూర్తి చేసి భవనాన్ని ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కంబాల చెరువు వద్ద నిలిచిపోయిన ప్రధాన డ్రెయినేజీ పనులకు కారణంపై ఆరాతీసి త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా భరత్ రామ్ మాట్లాడుతూ నగరంలో ప్రధాన సమస్యలు తెలుసుకోవడంతో పాటు ప్రజలతో మమేకమై వారికి ఇంకా ఎటువంటి సమస్యలు ఉన్నాయో తెలుసుకోవడానికి గుడ్ మార్నింగ్ రాజమహేంద్రవరం కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, వార్డు ఇన్‌చార్జి కుక్కా తాతబ్బాయి, యర్రా ప్రసాద్, గుడాల జాన్సన్ పాల్గొన్నారు. అలాగే టీడీపీ నాయకుడు యనమల రామకృష్ణుడు మేనమామ ముత్యాల కుమార్ రెడ్డమ్మను మార్గాని భరత్ రామ్ పరామర్శించారు. కాగా ముత్యాల కుమార్ రెడ్డమ్మ భరత్‌రామ్ తండ్రి మార్గాని నాగేశ్వరరావు మంచి స్నేహితులు.



గుడ్ మార్నింగ్ రాజమహేంద్రవరంలో పాల్గొన్న ఎంపీ భరత్ రామ్

47వ డివిజన్‌లో గడపగడపకూ

రాజమహేంద్రవరం సిటీ: పేద వర్గాల సంక్షేమం కోసం జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందేలా చేయడమే మనందరి కర్తవ్యమని ఎంపీ మార్గాని భరత్ రామ్ సూచించారు. గురువారం స్థానిక 47వ డివిజన్ క్వారీ మార్కెట్ సెంటర్ సందూరి పేట డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం నుంచి వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి, మాజీ కార్పొరేటర్ చోడిశెట్టి సత్యవాణి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ పర్యటించి, సంక్షేమ పథకాలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. ప్రజల సమస్యలపై ఆరా తీశారు. పింఛన్ రావడం లేదని ఓ వృద్ధురాలు తెలపగా, ఆమె దూర ప్రాంతానికి చెందినది కావడంతో పింఛన్ వచ్చే వరకూ సీజీఎఫ్ రూ.వెయ్యి ప్రతినెలా అందే ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. మరో ఇద్దరు మహిళలు రేషన్ కార్డు లేదని చెప్పడంతో కార్డు మంజూరయ్యే వరకూ ప్రతి నెలా రేషన్ ఉచితంగా అందజేయాలని అక్కడే ఉన్న రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. అదే ప్రాంతంలో రహదారి, డ్రెయినేజీ నిర్మాణ పనులకు ఎంపీ భరత్ రామ్, పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి కొబ్బరికాయ కొట్టారు. పార్టీ నాయకులు తిరగటి దుర్గ, పాలిక శ్రీను గుడాల ఆదిలక్ష్మి, ప్రసాద్ పాల్గొన్నారు.



గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎంపీ భరత్ రామ్

మర్యాదపూర్వకంగా..



కలెక్టర్ మాధవీలతకు జ్ఞాపిక అందిస్తున్న సంఘం నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ విప్పర్తి నిఖిల్ కృష్ణ, ఆ సంఘ నాయకులు గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో కలెక్టర్ మాధవీలతను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెకు జ్ఞాపిక అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు దాసరి రవితేజ, ట్రెజరర్ గద్దం సత్యప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేంద్ర, మండల అధ్యక్షుడు అశోక్, జనరల్ సెక్రెటరీ చిన్నబాబు, గోవింద్ పాల్గొన్నారు

ఉత్సాహంగా యూత్ ఫెస్టివల్



విజేతలకు బహుమతుల ప్రదానం

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడిలోని శ్రీమతి జాస్తి బుల్లెమ్మాయి డిగ్రీ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ యూత్ సర్వీసెస్ ఆధ్వర్యంలో నేషనల్ యూత్‌డే–2023 వేడుకలు గురువారం ఉత్సాహంగా జరిగాయి. ప్రిన్సిపల్ పి.జ్యోతి నేతృత్వంలో పాటలు, వక్తృత్వం, క్విజ్, వ్యాసరచన, కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా కళాశాల అధ్యాపకులు వ్యవహరించారు. సెట్రాజ్ మేనేజర్ కేఎస్‌వీ కాశీ విశ్వేశ్వరరావు, యువజన సర్వీసుల శాఖ సూపరింటెండెంట్ సీవీ సూర్యనారాయణ, ఫీల్డ్ ఆఫీసర్ గౌతమ్, ప్రోగ్రామ్ ఆఫీసర్ స్వాతి పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు రామతులసి

ప్రకాశం నగర్: హర్యానాలో ఈనెల 8న జరిగే జాతీయ సీనియర్ మహిళా క్రాస్ కంట్రి పోటీలకు ఎస్‌కేవీటీ విద్యార్థిని జి.రామతులసి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ పీఏ రాజబాబు గురువారం ప్రకటనలో తెలిపారు. ప్రకాశం జిల్లా కడవకుదురులో జరిగిన అంతర్ జిల్లా పోటీల్లో 40 క్రీడాకారులు పాల్గొనగా, వారిలో ఆరుగురు మహిళలు అర్హత సాధించారన్నారు. జిల్లా నుంచి రామతులసి ఎంపికైనట్లు చెప్పారు.

కాపునాడు మరింత బలోపేతం

సీటీఆర్ఐ: రాష్ట్రంలో కాపునాడును మరింత బలోపేతం చేసి కాపు ఉద్యమానికి నూతన ఉత్తేజం తీసుకువస్తామని కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు పురంశెట్టి మంగారావు అన్నారు. గురువారం కాపునాడు జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మంగారావు మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లా నుంచి కాపు ఉద్యమానికి సరికొత్తరూపు తీసుకువస్తామన్నారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేసి నూతన కమిటీలను వేస్తున్నామన్నారు. గౌరవాధ్యక్షుడు బోనం నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కాకిలేటి దుర్గారావు, కాకినాడ జిల్లా అధ్యక్షుడు దలే జోగిరాజు (నానిబాబు), కోనసీమ జిల్లా అధ్యక్షుడు అబ్బిరెడ్డి వెంకట స్వామి (సురేష్) పాల్గొన్నారు.

అభిప్రాయ సేకరణ

కడియం: టీడీపీ మండల అధ్యక్షుడు వెలుగుబంటి రఘురామ్ ఆధ్వర్యంలో గురువారం కడియంలో ఇదేం ఖర్మ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల అభిప్రాయాలను సేకరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.